తెరుచుకోని పాఠశాల..!

- పదేళ్ల క్రితం మూసివేత
- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు
- ప్రారంభించాలని గ్రామస్తుల వేడుకోలు



మూతపడిన ప్రభుత్వ పాఠశాల

నార్నూర్: ప్రతీ నిరుపేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలతో పాటు పాఠశాల అభివృద్ధి కోసం 'అమ్మ ఆదర్శ కమిటీ' పేరుతో ప్రత్యేక నిధులు కేటాయించి అన్నిరకాల మౌలిక సదుపాయాలతో పేద విద్యార్థులకు చదువులు అందించడానికి కృషి చేస్తోంది. మండలంలో మొత్తం 81 పాఠశాలలున్నాయి. 5,616 విద్యార్థులు చదువుకుంటున్నారు. గతంలో పనిచేసిన విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య లేదనే కారణంతో పాఠశాలను మూసివేయడం జరిగింది. ప్రస్తుతం నిరుపేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నా.. పట్టించుకునే నాథుడే లేడు.

కొత్తపల్లి హెచ్(దమ్మనగర్) ఎస్సీ కాలనీలో..

మండలంలోని కొత్తపల్లి(హెచ్) పరిధిలోని దమ్మనగర్ (ఎస్సీ కాలనీ)లో మొత్తం 100కు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలో మొత్తం 30 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులు లేరనే కారణంతో పదేళ్ల క్రితం విద్యాశాఖ అధికారులు తప్పుడు నివేదిక ఇవ్వడం వలన ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను తొలగించారు. అప్పటికీ గ్రామస్తులు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల సంఖ్యతో పాటు సమస్యను వివరించినప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 30 మంది చిన్నారులు ఉన్నారు. నిరుపేద దళిత కుటుంబాలు కావడంతో ప్రైవేట్ పాఠశాలలో చదివించుకోలేక రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లి(హెచ్) తండా ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రతీరోజు కాలినడకన పాఠశాలకు వెళ్లి వస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలను పునః ప్రారంభించాలని గ్రామస్తులు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలను ప్రారంభించాలి



మా గ్రామంలో మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నారు. చదువుకునేందుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తండాకు వెళ్తున్నారు. చాలా కష్టంగా ఉంది. తప్పుడు నివేదికలతో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలను వెంటనే ప్రారంభించాలి.

– సీహెచ్ దిలీప్, దమ్మనగర్, కొత్తపల్లి (హెచ్)

పట్టించుకోవడం లేదు



గత పదేళ్ల కిందట మూసివేసిన ప్రభుత్వ పాఠశాలను విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పునః ప్రారంభించాలి. ఈ విషయంలో విద్యాశాఖ అధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

– గౌతమ్, దమ్మనగర్ కొత్తపల్లి (హెచ్)

క్లుప్తంగా

నేడు మంత్రి సీతక్కతో సమావేశం

నేరడిగొండ: మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో సమావేశం ఉన్నట్లు కాంగ్రెస్ నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆడే వసంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

నేరడిగొండ: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో సాధన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలు అందించాలని, మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా చూడాలన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్చోడ: రానున్న రోజుల్లో జరగనున్న జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చాలని గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రోజారాణి అన్నారు. శుక్రవారం మండలస్థాయి క్రీడ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి పథకాలను సాధించిన విద్యార్థినులను అభినందించారు. సీఎం కప్ మండలస్థాయి పోటీల్లో సీనియర్ ఉమెన్స్‌లో ఖోఖోలో, సీనియర్ ఉమెన్స్ కబడ్డీలో ప్రథమ స్థానాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ లలిత, గీతాంజలి, పీడీలు స్రవంతి, నందిని, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు



విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు

తాంసి: మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం విద్యా విజ్ఞాన విహారయాత్రకు తరలివెళ్లారు. విద్యార్థులను బాసర, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిర్మల్ కొయ్య బొమ్మలను వీక్షించేందుకు తీసుకెళ్లారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు వాటి ప్రాముఖ్యతను వివరించారు. వారి వెంట ఉపాధ్యాయురాలు సరిత, పాఠశాల చైర్మన్ కవిత, సిబ్బంది ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఈనెల 15 ఆదివారం రోజు ప్రసన్నంజనేయ ఆలయ మూడో వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, 8 గంటలకు హోమం, 12 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, విజయ్ కుమార్, పురుషోత్తం, రవీందర్, మహేందర్ పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన సాయమ్మకు శస్త్ర చికిత్స కోసం బి నెగిటీవ్ రక్తం అవసరం ఉండగా కుటుబసభ్యులు స్వచ్ఛంద సంస్థ సభ్యులను సంప్రదించారు. దీంతో ఆ సంఘం వ్యవస్థాపకుడు రమేశ్, అధ్యక్ష, కార్యదర్శులు దినేశ్, ఓం ప్రకాష్‌లు స్పందించి జైనథ్ మండలం సావపూర్‌కు చెందిన సాయితేజ ద్వారా రక్తదానం చేయించారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

తాంసి: భీంపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ కుటుంబాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ రాథోడ్ ధరమ్‌సింగ్ తల్లి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. కాగా ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ కన్వీనర్ నాగయ్య, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, లింబాజీ, నరేందర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న గోడం గణేష్

ఆదిలాబాద్‌రూరల్: సినీనటుడు మోహన్ బాబు జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కన్వీనర్ గోడం గణేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఆందోళనగా మారిన గొడవ గురించి ప్రశ్నించిన మీడియాను మైకు లాగి రిపోర్టర్లపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గాయపడిన జర్నలిస్టులకు వైద్య ఖర్చులు భరించాలన్నారు. సమాజాహితం కోసం పనిచేసే జర్నలిస్టులను అవమానకరంగా చూసి పదజాలంతో దూషిస్తూ దాడి చేసి గాయపర్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, గోడం రేణుక, ఉయిక ఇందిర, కుమ్ర గోవింద్, అమల్ పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు అనుమతి ఇవ్వండి



వినతిప్రతం అందజేస్తున్న సీఆర్టీలు

ఇచ్చోడ: ఈనెల 16 నుంచి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల సమ్మెలో పాల్గొనడానికి అనుమతిని ఇవ్వాలని శుక్రవారం మేడిగూడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలతకు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వినంత్‌రావు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ క్రమబద్ధీకరించాలని, గ్రీన్‌చానల్ ద్వారా నెల నెల వేతనాలు ఇవ్వాలన్నారు. వేతనాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, రమేశ్, చంద్రకళ, కిష్టయ్య, ఆత్మరాం, మనోజ్‌కుమార్, గోవర్దన్, శిరిష, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సంతోషిమాత బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన ఆలయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సంతోషిమాత బ్రహ్మోత్సవాలను ఈనెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనురాజ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. ఈ 20న ఉదయం 8 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 21న సుప్రభాత సేవ, వేద పఠం, గణపతి పూజ, పుణ్యవచనం, నవగ్రహ పూజ, చండీ హోమం, పూర్ణహుతి, 22న ఉదయం 5 గంటలకు మహాభిషేకం, 9 గంటలకు అమ్మపాదుకలతో అమ్మవారి పల్లకి ఊరేగింపు, 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఫోరం చైర్మన్ నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ వినియోగదారుల హక్కుల ఫోరం చైర్మన్ ఎర్కల నారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మావల, దస్నాపూర్, ఆదిలాబాద్‌రూరల్ ప్రాంతాల విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదు వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది వినియోగదారులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వేలాడే తీగలు, అదనపు స్తంభాల ఏర్పాటు, విద్యుత్ బిల్లుల తప్పిదాలకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే తెలియజేయాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, ఫోరం సభ్యులు రామకృష్ణ, కిషన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని, అంకిత భావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ భవనంలో ఇటీవల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల మాన్కాపూర్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నీలయ్య, రాజేశ్వర్, రాజబాబు, విజయ్, ప్రతాప్, రవీందర్, వాచ్‌మెన్ అమృత్‌రావులను మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువుల దీవేనల ద్వారా ప్రతిఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదుగుతారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లవ్ కుమార్, వీటీడీఏ ఉపాధ్యక్షుడు రాథోడ్ గణేష్, మాజీ ఉపసర్పంచ్‌లు రూప్‌దేవ్, రాథోడ్ గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పెండల్‌వాడ గ్రామానికి చెందిన టాప్రే అడెల్లు ఇటీవల చేపల వేటకు వెళ్లి వాగులో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి మృతుడిని నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేశారు.

జాతరకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలో ఆదివారం నిర్వహించే సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి రావాలని గ్రామస్తులు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జాతరకు హాజరవుతారని చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్, కిషన్, ప్రమోద్, పోచ్చన్న పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

తాంసి: భీంపూర్ మండలంలోని ఇందిరానగర్‌లో అక్రమంగా సాగు చేసిన గంజాయిని భీంపూర్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన జాదవ్ తులసీరాం తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై కలీంతో కలిసి తనిఖీ చేశారు. తనిఖీల్లో తులసీరాం ఇంట్లో 126 గ్రాముల ఎండు గంజాయితో పాటు ఇంటిపక్కన నాలుగు మొక్కలు గుర్తించారు. గుర్తించిన గంజాయిని స్వాధీనం చేసుకుని తులసీరాంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపా రు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.33వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన బొజ్జ నర్సిములు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందగా.. ఆయన భార్య బొజ్జ జ్యోతికు రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎస్‌బీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సురేశ్ శుక్రవారం మావల బ్రాంచ్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సిములు గతంలో ఎస్‌బీఐ మావల బ్రాంచ్‌లో రూ.వెయ్యితో వ్యక్తిగత ప్రమాద బీమా చేయించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ స్నేహ, నిహర్, క్యాషియర్ రాహుల్, మేనేజర్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: టీఎస్ యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్‌లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 15న ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉదయం 10 గంటలకు మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షిషా, డీఈవో ప్రణీత, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్‌లు హాజరవుతారని తెలిపారు. సంఘ బాధ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తలమడుగు: ఈనెల 15న నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు కొల్లూరి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఈవో వెంకట్‌రావుతో కలిసి మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ బడులు పరిరక్షణ కోసం విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న సంఘం టీఎస్ యూటీఎఫ్ అన్నారు. సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్‌రావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శులు రమేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించాలని ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్, సరస్వతినగర్ ప్రాథమిక పాఠశాలల్లో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం వాటిని ప్రారంభించిన అనంతరం ఎంఈవో మాట్లాడారు. నీతి కథలు, బొమ్మలకు సంబంధించిన పుస్తకాలు ఆసక్తి పెంపొందించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నీలాదేవి, టెక్స్‌బుక్ మేనేజర్ నూటెంకి సత్యనారాయణ, రూమ్ టు రీడ్ ప్రతినిధులు వేణుగోపాల్, మహేందర్, ఉపాధ్యాయులు మల్లేశ్, సావిత్రిబాయి, వెంకట్‌రాంరెడ్డి, శోభ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: ఇందిరమ్మ పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన సర్వే కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని వాంకిడి గ్రామ పంచాయతీలో నిర్వహించిన సర్వేను ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, కుటుంబసభ్యుల వివరాలు, సొంత ఇంటి స్థలం, దానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అర్హులైన లబ్ధిదారులు సొంత స్థలం ఉన్న వారి పేర్లను పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడవ్ మారుతి, గ్రామస్తులు దేవురావు, పాన్‌పట్టె దత్తురాం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్జీవో ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ బాల్ స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. హెచ్‌బీ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులను రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటే రోగనిరోధక శక్తి తగ్గుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఫర్హాన జబీన్, ఫార్మాసిస్టు నవీన్, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆరోగ్య స్వస్థత కేంద్రం



నార్నూర్: గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య స్వస్థత కేంద్రాలను నిర్మించింది. అయితే సరైన యోగా శిక్షకులు లేకపోవడంతో వృథాగా మారాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో నేషనల్ ఆయుష్ మిషన్ నిధులతో నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రం గత రెండేళ్లుగా ఉపయోగంలోకి రాలేదు. శ్వాస సమస్యలతో ఆసుపత్రికి వచ్చే ఓపీ పేషెంట్లు, సాధారణ ప్రసవాలు అయ్యేలా గర్భిణులతో యోగా చేయించదానికి ఏర్పాటు చేసిన కేంద్రంలో సరైన శిక్షకులను ప్రభుత్వం నియమించకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించడం లేదు.